## మోడల్‌స్కూల్ టీచర్ల బదిలీలు చేపట్టాలి

నెక్కొండ, జూలై 27: బదిలీలు, ప్రమోషన్లు లేక 11 ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నామని, వెంటనే ఉద్యోగోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలని మోడల్ స్కూల్ టీచర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు నెక్కొండలో శనివారం వారు భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. బదిలీలు చేస్తామని గతేడాది ఇచ్చిన నోటిఫికేషన్‌ను నిలిపివేశారని, ఈ ఏడాది జూన్‌లో బదిలీలు చేస్తామని ఇంకా చేయలేదని ధ్వజమెత్తారు. నిరసనలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఉదయశ్రీ, ఉపాధ్యాయులు శ్రీధర్, వెంకయ్య, అమీనా, రాజు, పద్మావతి, దీప్తి, సుధా పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మోడల్ స్కూల్ టీచర్లు

## 'గుడుంబా అమ్మితే పథకాలు బంద్'

సంగెం, జూలై 27: గుడుంబా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా వారికి ప్రభుత్వ పథకాలను నిలిపివేస్తారని వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ స్వరూప హెచ్చరించారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో శనివారం గుడుంబా అమ్మకం, తయారీదారులు, డ్రగ్స్ రవాణాదారులకు ఎక్సైజ్, రెవెన్యూ, పోలీసు, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో కలిసి అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐ స్వరూప మాట్లాడుతూ గుడుంబా తయారీ, అమ్మకాన్ని మానేసిన వారికి ప్రభుత్వం తరపున జీవనోపాధి కల్పిస్తామన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో రవీందర్, సంగెం ఎస్సై ఎల్.నరేశ్, ఏఈ మధుసూదన్, ఎక్సైజ్ ఎస్సైలు సరిత, గంగాధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ స్వరూప

## 'గీత కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన సర్కార్'

నర్సంపేట రూరల్, జూలై 27: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపట్టిన బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందని మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్ ధ్వజమెత్తారు. సర్వాపురంలో శనివారం జరిగిన మోకుదెబ్బ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క కల్లు గీత వృత్తిదారులకు రూ. 68 కోట్లు, నీరా ప్రాజెక్టు కోసం రూ. 25 కోట్లు కేటాయించారన్నారు. గీత కార్మికుల సంక్షేమం కోసం రూ. 500 కోట్లు అవసరం కాగా, రూ. 68 కోట్లు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. ప్రతి జిల్లాలో నీరా కేఫ్‌లు ఏర్పాటు చేస్తే రూ. 100 కోట్లు అవసరం కాగా, రూ. 25 కోట్లు మాత్రమే ప్రభుత్వం కేటాయించిందన్నారు. గీత కార్మికులకు ఉచితంగా సేఫ్టీ మోకులు అందించాలని కోరారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శి గొడిశాల సదానందంగౌడ్, జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్‌గౌడ్, రాష్ట్ర నాయకులు గంప రాజేశ్వర్‌గౌడ్, మాచర్ల ఐలుమల్లు, రామగోని సుధాకర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు జూలూరి హరిప్రసాద్‌గౌడ్, మల్లేశం, గణేశ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనంతుల రమేశ్‌గౌడ్

## ఐరన్ షాపుల్లో చోరీ

### *రూ.35వేల నగదు అపహరణ*

గిర్మాజీపేట, జూలై 27: గుర్తుతెలియని వ్యక్తులు వరంగల్ 28వ డివిజన్ హంటర్ రోడ్‌లోని 12 మోరీల వద్ద ఉన్న పలు ఐరన్ షాపుల్లో చొరబడి రూ.35వేల నగదును అపహరించారు. షాపుల నిర్వాహకులు పల్లా ఈశ్వర్, శ్రీనివాస్, కొండబర్తి రాఘవేంద్ర కథనం ప్రకారం.. శుక్రవారం రాత్రి యజమానులు తమ షాపులను మూసి ఇంటికి వెళ్లిపోయారు. ఈక్రమంలో శనివారం తెల్లవారుజామున 3గంటలకు దుండగులు రాడ్‌తో షటర్లను ఎత్తి షాపుల్లోకి ప్రవేశించారు. జగదాంబ ఐరన్ అండ్ శానిటరీ షాపులో రూ. 15 వేల నగదు, కనకదుర్గ షాపులో రూ. 5 వేల నగదు, దుర్గా ఐరన్ మర్చంట్స్ షాపులో రూ. 15 వేల నగదును చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మట్టెవాడ పోలీసులు తెలిపారు.

WANTED
VMR Hostel
రాంపూర్, వరంగల్
నందు పని చేయుటకు
♦ Warden (M/F)
♦ వంట మనిషి
వెంటనే కావలెను.
9849224169

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318953

WANTED
★Wanted PRO's for MBBS in Abroad Education. Please Contact Phone No. 8121554649.
NTW-314856

FOR SALE
★Shop in Auto Nagar 45 Lakhs (Rs. 9000/- Getting Rent), House in Kasibugga 45 Lakhs (Rs. 6,200/- Getting Rent). Cont: 9492199961.
NTW-00

HEALTH CARE
★ఆత్మీయ రిహాబ్ సెంటర్ యందు వృద్ధులకు మరియు పక్షవాతం, సర్జరీ తరువాత రికవరీ కోసం, క్యాన్సర్ పేషెంట్స్ కొరకు అవసరమగు 24 గం||ల సేవలు అందించబడును.
సంప్ర: 6281476205, 9440325526
KMM-11867

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

# దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- విద్యార్థులు మొక్కలను దత్తత తీసుకోవాలి
- ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలో కలెక్టర్ తనిఖీలు

ఖానాపురం, జూలై 27: కలెక్టర్ సత్య శారద శనివారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, ఈజీఎస్ కార్యాలయాలు, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతోపాటు అశోక్‌నగర్‌లోని సైనిక్‌స్కూల్‌ను డీఆర్డీవో కౌసల్యాదేవితో కలిసి తనిఖీ చేశారు. ముందుగా కలెక్టర్ ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ప్రజాపాలన దరఖాస్తుల విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తర్వాత ఈజీఎస్ కార్యాలయాన్ని తనిఖీ చేయగా, భవనం వర్షాలకు కురుస్తున్నదని, ఫైల్స్ తడుస్తున్నాయని కలెక్టర్ దృష్టికి సిబ్బంది తీసుకెళ్లారు. రికార్డులు తడవకుండా కాపాడాలని ఆమె సూచించారు. పీహెచ్‌సీ తనిఖీకి వెళ్లగా, దవాఖానలో ఎవరూ లేరని, వైద్య శిబిరం నిర్వహణకు వెళ్లారని తెలియడంతో అక్కడి నుంచి ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లలో భాగంగా నిర్వహిస్తున్న మెడికల్ షాపు, బేకరిని తనిఖీ చేశారు. షాపుల నిర్వాహకులతో మాట్లాడారు. నెలకు ఎంత సంపాదిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. షాపులను వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. కలెక్టర్ బేకరిలో డబ్బులు చెల్లించి తినుబండారాలను కొనుగోలు చేసి రుచి చూశారు. అనంతరం అశోక్‌నగర్ సైనిక్‌స్కూల్‌ను తనిఖీ చేశారు. మొదట వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించారు. ఇటీవల పాఠశాల ఆవరణలో డీఆర్డీఏ ఆధ్వర్యంలో నాటించిన మొక్కలను పరిశీలించారు. విద్యార్థులకు మొక్కల ఉపయోగం గురించి వివరించారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను దత్తత తీసుకుని బతికిస్తే ఆ మొక్కపై విద్యార్థి పేరు పెడతామన్నారు. దీంతోపాటు ఆదివారం జిల్లా వైద్యాధికారిని సైనిక్‌స్కూల్‌కు పంపించి ప్రతి విద్యార్థికి సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. విద్యార్థులందరూ బాగా చదువుకుని జిల్లా, రాష్ర్టానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఆమె వెంట ఆర్డీవో కృష్ణవేణి, ఎంపీడీవో భారతి, ఎంపీవో అంబటి సునీల్, సైనిక్‌స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సురేందర్ ఉన్నారు.



*ఖానాపురం: అశోక్‌నగర్ సైనిక్‌స్కూల్‌లో డైరెక్టర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద*

**బ్యాటరీల మాయంపై కలెక్టర్ ఆరా**

మండలకేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయంలో ఇన్వర్టర్ బ్యాటరీలు మాయమయ్యాయి. దీనిపై శనివారం 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. దీంతో ఆమె ఈజీఎస్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సందర్భంగా బ్యాటరీల మాయం, నూతన బ్యాటరీల ఏర్పాటుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో సిబ్బంది, అధికారికి మధ్య సమన్వయం లేదన్న విషయాన్ని తెలుసుకున్నారు. ఏపీవో ఎందుకు విధులకు రాలేదని ఎంపీడీవోను అడిగారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**ప్రత్యేక ప్రజావాణికి 17 దరఖాస్తులు**

ఖిలావరంగల్: కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన దివ్యాంగులు, వృద్ధుల ప్రజావాణికి 17 మంది దరఖాస్తు చేసుకున్నారు. డీఆర్డీవో శాఖకు 11, సివిల్ సప్లయ్ 1, డీడబ్ల్యూవో 2, సఖీ 1, పోలీసు, ఉపాధి కల్పన శాఖకు సంబంధించిన 1 దరఖాస్తు వచ్చింది. వీటిని కలెక్టర్ సత్య శారద స్వీకరించారు. దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీడబ్ల్యూవో హైమావతి, డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి పాల్గొన్నారు.

## పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వద్దు

*గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే*

వరంగల్, జూలై 27 : పారిశుధ్య నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలని, అలసత్వం వహిస్తే సహించేది లేదని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హెచ్చరించారు. శనివారం గ్రేటర్ పరిధిలోని పలివేల్పుల, పెగడపల్లి, ముచ్చర్ల, విజయలక్ష్మి కాలనీల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లను కమిషనర్ మందలించారు. జవాన్లు గాదె కుమార్, సంగాల రోహిత్, కార్మికుడు సంగాల ప్రసాద్‌కు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సీఎంహెచ్‌వో రాజేశ్‌ను ఆదేశించారు. అనంతరం పారిశుధ్య కార్మికుల హాజరు పట్టికను పరిశీలించారు. హాజరు వేసిన సిబ్బంది విధుల్లో ఉన్నారా? అనే విషయాన్ని నిర్ధారణ చేసుకున్నారు. రెండు రోజుల పారిశుధ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులు ఏ ఏ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నారో అక్కడికి వెళ్లి పరిశీలించారు. అర్బన్ మలేరియా సిబ్బంది రోజు వారీగా చేసే పనులు, దోమల నివారణకు ఉపయోగించే పద్ధతులపై బయాలజిస్ట్ మాధవరెడ్డిని ఆరా తీశారు. రోడ్లపై గుంతలు లేకుండా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కాకతీయ ఫిల్టర్ బెడ్‌ను తనిఖీ చేశారు. నీటి శుద్ధీకరణపై ఎస్‌ఈని వివరాలు అడిగారు. వర్షాకాలం నేపథ్యంలో లీకేజీలను అరికట్టాలని, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని ఇంజినీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌ఈ రాజయ్య, సిటీ ప్లానర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఏఈలు హరికుమార్, శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు స్రవంతి, బాషా నాయక్, హెల్త్ అసిస్టెంట్ మధుకర్ పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కమిషనర్

## మాఫీకి కొర్రీలు పెడుతుండ్లు



ఖిలావరంగల్: ఎన్నికలప్పుడు రుణమాఫీ చేస్తమన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు కొర్రీలు పెడుతున్నది. రూ. లక్షలోపు రుణమాఫీ అన్నరు. నాకు రూ. 95 వేల రుణం మాఫీ చేయమంటే పొంతలేని ప్రశ్నలు వేస్తాండ్లు. నాకు నాలుగున్నర ఎకరాల భూమి ఉంటే.. రెండు ఎకరాలు పత్తి, రెండున్నర ఎకరాలు వరి సాగు వేసిన. ఇప్పుడు రైతు భరోసా లేదు. రుణమాఫీ లేదు. సీఎం కేసీఆర్ సార్ ఉన్నప్పుడు సాగు సమయానికి పెట్టుబడి అందించిండ్రు. వీళ్లేమో కొర్రీలు పెడుతుండ్రు.

*– బట్టమేకల సాంబరాజు, గాడిపల్లి*

## నర్సింహుడిని దర్శించుకున్న సివిల్ కోర్టు జడ్జి

గీసుగొండ, జూలై 27: కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామిని శనివారం నర్సంపేట సివిల్ కోర్టు జడ్జి శిరీష దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయ గర్భగుడిలో స్వామివారికి పూజలు చేశారు. అనంతరం ఆలయ మర్యాదలతో అర్చకులు శ్రీనివాసాచార్యులు, కాండూరి రామాచార్యులు, ఫణింద్ర, విష్ణుచార్యులు ఆమెను ఆశీర్వదించి సన్మానించారు.



జడ్జిని ఆశీర్వదిస్తున్న అర్చకుడు

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఖానాపురం/రాయపర్తి, జూలై 27: ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి జ్యోతి అన్నారు. ఐనపల్లిలోని జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, దోమల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామలింగయ్య, సిబ్బంది భాస్కర్, శిరీష పాల్గొన్నారు. అలాగే, రాయపర్తి మండలంలోని వెంకటేశ్వరపల్లిలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సన్నూరు పల్లె దవాఖాన వైద్యాధికారి బి.హారిక ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ధరావత్ భీమానాయక్, ఏఎన్‌ఎం రజిత, కార్యదర్శి బత్తుల నర్సయ్య పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జ్యోతి

## మున్సిపల్ కార్మికుల వేతనాలు చెల్లించాలి

నర్సంపేట, జూలై 27: మున్సిపల్ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నర్సంపేటలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సంపేట మున్సిపాలిటీలోని శానిటేషన్, ఇతర విభాగాల్లో పని చేస్తున్న కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కార్మికుల్లో చాలా మంది నెల జీతంపై ఆధారపడి బతుకుతున్నారని, నెలల తరబడి వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, వారికి ఆరు నెలలకోసారి ఇచ్చే సేఫ్టీ పరికరాలను వెంటనే అందించాలన్నారు. మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు సమ్మయ్య, అధ్యక్షుడు భాస్కర్, ఉపాధ్యక్షుడు రాజు, దాడువాయి యూనియన్ రాష్ట్ర నాయకుడు రవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోనె యువరాజ్

## సంఘ్ వరంగల్ బ్రాంచ్ చైర్మన్‌గా రాజ్‌కుమార్



రాజ్‌కుమార్

ఖిలావరంగల్, జూలై 27: సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘం వరంగల్ బ్రాంచ్ కార్యవర్గాన్ని సంఘ్ ప్రకటించింది. వరంగల్ బ్రాంచ్ చైర్మన్‌గా రాజ్‌కుమార్, కార్యదర్శిగా బాలాజీనాయక్, కోశాధికారిగా ఎండీ రఫీక్‌ను నియమించారు. తమను అవకాశం కల్పించిన డివిజనల్ నాయకుడు ప్రభురాజ్, కొత్త మురళీకృష్ణకు నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది. అలాగే, నూతన కమిటీ బాధ్యులకు వరంగల్ బ్రాంచ్ పరిధిలోని ఉద్యోగులు, నాయకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## 'జిల్లా సమగ్రాభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వం'

నర్సంపేట, జూలై 27: జిల్లా సమగ్రాభివృద్ధిని విస్మరించి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించిందని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ విమర్శించారు. నర్సంపేటలో శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలయ్యేలా రాష్ట్ర బడెట్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు.

## అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

గిర్మాజీపేట, జూలై 27: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందేందుకు జిల్లాలోని జిల్లా, మండల పరిషత్, టీఆర్‌ఈఐఎస్ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో డీ వాసంతి కోరారు. ఆసక్తిగల ఉపాధ్యాయులు రెండు ప్రతుల ప్రతిపాదనలను ఎంఈవోలతో ధ్రువీకరించుకొని ఆగస్టు 3లోగా జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు.

## కోటలో రైతు సదస్సు

ఖిలావరంగల్, జూలై 27: పడమర కోటలో లయన్స్ క్లబ్ భీమారం ఆధ్వర్యంలో శనివారం రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను సత్కరించి మొక్కలు అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, రేవతి, రాజారాం, రైతు సంఘం నేతలు పాల్గొన్నారు.

## మార్కెట్‌లో కార్యదర్శి తనిఖీలు

కాశీబుగ్గ, జూలై 27: లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్‌ను కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజామున ఎనుమాముల మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, గ్రేడ్–2 కార్యదర్శి శ్రీరామోజు రాము, అసిస్టెంట్ కార్యదర్శి గంధమల్ల రాజేందర్, సూపర్‌వైజర్లు, సిబ్బంది తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యాపారులు, వినియోగదారులతో మాట్లాడారు. హోల్‌సెల్ షాపుల యజమానులు, గుమస్తాల సెల్ నంబర్లు, ఇతర వివరాలు సేకరించారు.

## కడుపునొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య

గీసుగొండ, జూలై 27: మచ్చాపురానికి చెందిన కంబాల శ్రీనివాస్ (40) ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ బాబులాల్ తెలిపారు. శ్రీనివాస్ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడని, శనివారం నొప్పి భరించలేక ఇంట్లో గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించగా, చికిత్సపొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

## డయల్ 100 ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

*సీపీ అంబర్ కిశోర్ ఝా*

సుబేదారి, జూలై 27 : డయల్ 100 ఫిర్యాదులపై వెంటనే పోలీసు అధికారులు, సిబ్బంది స్పందించాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశించారు. కమిషనరేట్ బ్లూకోల్ట్స్, పెట్రోకార్ పోలీసు అధికారులు, సిబ్బందితో శనివారం హనుమకొండలోని సీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డయల్ 100 ఫిర్యాదులపై మరింత మెరుగైన సేవలు అందించాలని, నిర్దేశించిన సమయంలో చేరుకోవాలన్నారు. శాంతిభద్రతల విషయంలో ముందస్తు సమాచారం సేకరించాలని, రౌడీషీటర్లు, కేడీలపై నిఘా పెట్టాలన్నారు. సమయస్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని సూచించారు. నిజాయితీగా పనిచేసే సిబ్బందికి రివార్డులు ఉంటాయన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ రవి, ఏసీపీలు తిరుమల్, నందిరాంనాయక్, నర్సయ్య, భీంశర్మ, పార్థసారథి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీపీ

## డీసీసీ బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

*టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు*

సుబేదారి, జూలై 27 : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. తెలంగాణ డిస్ట్రిక్ట్ కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ మొదటి జనరల్ బాడీ సమావేశం శనివారం నక్కలగుట్టలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కో ఆపరేటివ్ ఉద్యోగుల పని తీరుతో డీసీసీ బ్యాంకులు లాభాల బాటాలో నడుస్తున్నాయని, సీపీవో రద్దు, ఇతర సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానన్నారు. సమావేశంలో టెస్కాబ్ వైస్ చైర్మన్ సత్తయ్య, స్టేట్ జిల్లా కో ఆపరేటివ్ అధ్యక్షుడు రియాజుద్దీన్, కార్యదర్శి సర్వేశ్వర్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మార్నేని

## రాష్ట్ర ప్రభుత్వంపై రాజీలేని పోరాటం

రాయపర్తి, జూలై 27: గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేయాలని కార్యకర్తలు, నాయకులకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వన్నాల వెంకటరమణ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నెరవేర్చే దమ్మూ ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని ఎద్దేవా చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వడ్లకొండ రవి, నియోజకవర్గ స్థాయి నాయకుడు లేగ రామ్మోహన్‌రెడ్డి, కర్ర శ్రీనివాస్‌రెడ్డి, పూసర్ల శ్రీమాన్, కన్నె కంటి కృష్ణారెడ్డి, మురళీమనోహర్, నాగపురి రాంబాబు, బూరుగు నవీన్ పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలతోనే తగిన గుర్తింపు

సంగెం, జూలై 27: ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని మండల ప్రత్యేకాధికారి వేదవతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు శనివారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శత్రఘ్నుడు, సంధ్య, కార్యదర్శులు కిరణ్, రమేశ్, అటెండర్లు బుచ్చయ్య, అనిల్‌ను తోటి ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఎంపీవో కొమురయ్య, సీనియర్ అసిస్టెంట్ ఓంప్రకాష్, ఏపీవో గణేశ్ పాల్గొన్నారు.



వీడ్కోలు పలుకుతున్న ఉద్యోగులు

## బల్దియా సిటీ ప్లానర్ వెంకన్న బదిలీ

వరంగల్, జూలై 27 : గ్రేటర్ కార్పొరేషన్ సిటీ ప్లానర్ వెంకన్న బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిటీ ప్లానర్ వెంకన్న గ్రేటర్ హైదరాబాద్ అదనపు చీఫ్ సిటీ ప్లానర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గ్రేటర్ హైదరాబాద్‌లో డిప్యూటి సిటీ ప్లానర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శైలజకు పోస్టింగ్ ఇచ్చారు. అలాగే హైదరాబాద్‌లో డీటీసీపీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రవీంద్ర డీ రేడేకర్‌ను వరంగల్ గ్రేటర్ కార్పొరేషన్ డిప్యూటీ సిటీ ప్లానర్‌గా బదిలీ చేశారు.

## ముగ్గురు సీఐల బదిలీ

సుబేదారి, జూలై 27 : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ శనివారం సీపీ అంబర్ కిశోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. ఓ రమేశ్, పీ దామోదర్‌రెడ్డి సీసీఎస్ వరంగల్‌కు, ఎం రంజిత్‌కుమార్ వరంగల్ టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు.

## సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

గిర్మాజీపేట, జూలై 27: ప్రస్తుతం వయస్సుతో సంబంధం లేకుండా అందరూ గుండెజబ్బుల బారిన పడుతున్నందున సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో కాజీపేట వెంకటరమణ అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో సీపీఆర్‌పై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. వాయు మార్గం, శ్వాసప్రసరణ, డిఫిబ్రిలేషన్, షాక్ వాటికి సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడొచ్చన్నారు. సీపీఆర్ విధానం ప్రతి పౌరుడికి తెలిసి ఉండాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, ప్రోగ్రాం అధికారి పద్మశ్రీ, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, డీపీవో అర్చన, వైద్యాధికారులు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి

గీసుగొండ, జూలై 27: జూన్ 28 తర్వాత పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో హరిప్రసాద్‌బాబు సూచించారు. ఏఈవోలతో శనివారం ఆయన సమావేశమయ్యారు. రైతుబీమా చేసుకొని రైతుల వివరాలను ఇప్పటికే రైతు వేదికలు, జీపీ కార్యాలయాల్లో ప్రదర్శించినట్లు చెప్పారు. ఏఈవోలు విజయ్, అఖిల, కావ్య, రజిని, అబిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

## 4న టీపీకేఎస్ సదస్సు

ఖిలావరంగల్, జూలై 27: చార్‌బౌళీలోని పద్మశాలీ భవనంలో వచ్చే నెల 4న జరుగనున్న టీకేఎస్ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల నాగరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం కోటలో కరపత్రాలు ఆవిష్కరించారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు ఎండగట్టేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియా కన్వీనర్ సరేందర్, చందు, రవన్న, బాబు, మహేందర్, భాస్కర్, దాసు, కరుణాకర్ పాల్గొన్నారు.

## డివిజన్ సమస్యలు పరిష్కరించాలి

కరీమాబాద్, జూలై 27: డివిజన్ లో చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని 40వ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను శనివారం ఆయన జీడబ్ల్యూఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. మౌలిక వసతులు లేక డివిజన్ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మరుపల్ల రవి అన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాని అధికారులను కోరారు.

## నిట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నెక్కొండ, జూలై 27: నిట్ వరంగల్ ఆధ్వర్యంలో మండలంలోని మడిపెల్లిలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్ఐటీ వరంగల్ పరిశోధక విద్యార్థి వినోద్‌లోక్ నాయక్ ఆధ్వర్యంలో నిట్ వైద్య బృందం 426 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసింది. నిట్ మెడికల్ అధికారి డాక్టర్ రాధా రుక్మిణి, డాక్టర్ కార్తీక్, డాక్టర్ రంగిలాల్, నెక్కొండ పీహెచ్‌సీ వైద్యాధికారులు రహేలా తన్వీర్, సుమన్, సూపర్‌వైజర్లు యాకస్వామి, వరమ్మ, సరోజ, నిట్ సిబ్బంది సుధాకర్ పాల్గొన్నారు.

## కలాం ఆశయాలను కొనసాగిద్దాం..

చెన్నారావుపేట, జూలై 27: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను కొనసాగిద్దామని కలామ్స్ ఫౌండేషన్ సభ్యులు పిలుపునిచ్చారు. ఉప్పరపల్లిలోని పల్లె దవాఖానలో శనివారం అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలామ్ ఫౌండేషన్ అధ్యక్షుడు బాషమియా, కార్యదర్శి మధుకర్, హెల్త్ ఆఫీసర్ వెంకటరెడ్డి, శివాజీ, కలాం ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు చల్లా పరామర్శ

సంగెం, జూలై 27: మొండ్రాయిలో అనారోగ్యంతో కొనకటి రామక్క మృతి చెందింది. విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గ్రామానికి చేరుకొని రామక్క మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, మాజీ వైస్‌ఎంపీపీ బుక్క మల్లయ్య, సంగెం సొసైటీ చైర్మన్ వేల్పుల కుమారస్వామి, గన్ను సంపత్, కొనకటి మొగిలి ఉన్నారు.

## 'బీసీ రిజర్వేషన్లు పెంచాలి'

కాశీబుగ్గ, జూలై 27: బీసీ రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శాసనసభ ఎన్నికల ముందు బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42శాతం రిజర్వేషన్ పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం బీసీ హక్కుల సాధన సమితి విస్తృత సమావేశాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని హిమయాత్‌నగర్‌లో నిర్వహించనున్నట్లు తాటిపాముల వెంకట్రాములు తెలిపారు.

## విద్యుత్‌తో జాగ్రత్తగా ఉండాలి

నర్సంపేట, జూలై 27: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఈ మధుసూదన్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ వానకాలం ప్రారంభమైన నాటి నుంచి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సిబ్బంది శ్రమిస్తున్నామని తెలిపారు. ప్రజలు అధికారులు, సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమస్య ఉంటే వెంటనే విద్యుత్ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఇప్పటివరకు డివిజన్‌లో 275 విద్యుత్ స్తంభాలను మార్చినట్లు వివరించారు.

## 'స్థానిక ఎన్నికల్లో అవకాశం కల్పించాలి'

వర్ధన్నపేట, జూలై 27: ఇద్దరికంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఇద్దరికంటే ఎక్కువ పిల్లలున్న వారికి పోటీ చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు గుర్తుచేశారు.

## వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

కాశీబుగ్గ, జూలై 27: వర్షాలు కురుస్తున్నందున ఎనుమాముల పరిధి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ పులి రమేశ్‌గౌడ్ సూచించారు. శనివారం ఆయన 14వ డివిజన్‌లోని సాయిగణేశ్ కాలనీ, ఎస్‌ఆర్‌నగర్‌లో లోతట్టు ప్రాంతాలను సందర్శించారు.

## పర్వతగిరిలో వీధి కుక్కల పట్టివేత

పర్వతగిరి, జూలై 27: మండలకేంద్రంలో శనివారం వీధి కుక్కలను పట్టారు. కొన్ని రోజులుగా గ్రామంలో వీధి కుక్కలు ప్రజలపై దాడులు చేస్తుండడంతో ఎంపీడీవో శంకర్ ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శి రఘు సిబ్బందితో కుక్కలను పట్టించి వేరేచోటుకు తరలించారు.